తెలంగాణ వాణి
శుక్రవారం, జూన్ 5, 2026

## సింగరేణి అప్రెంటిస్ ఉద్యోగిని ఆత్మహత్యపై ఇంటెలిజెన్స్ ఆరా

### తెలంగాణ వాణి పత్రిక కథనంతో అధికారుల్లో ఆందోళన



తెలంగాణ వాణి

**సింగరేణి అప్రెంటిస్ ఉద్యోగిని ఆత్మహత్యలో కొత్త ట్విస్ట్**

- ఉన్నతాధికారుల వేధింపులే ఆమె చావుకు కారణమా ?
- అధికారులను కాపాడే క్రమంలో చిరుద్యోగులు బలి అవ్వాల్సిందేనా
- పీవీకె గనిలో అప్రెంటిస్ ఉద్యోగిని మృతిపై సమగ్ర విచారణ జరిగేనా?
- గిరిజన బిడ్డ మృతికి న్యాయం జరిగేనా?

భద్రాద్రి బ్యూరో, జూన్ 03 (తెలంగాణ వాణి) సింగరేణి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అమ్మాయిలు సైతం బొగ్గు గనుల్లో అడుగుపెట్టారు. క్లిష్టమైన పనుల్లోనూ రాణిస్తు అధికారులుగా, కార్మికులుగా, టెక్నీషియన్లుగా విధులు నిర్వహిస్తూ.. చరిత్రను తిరగరాస్తున్నారు. సింగరేణి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బొగ్గు ఉత్పత్తిలో అమ్మాయిలు సైతం కదం తొక్కుతున్నారు. మాకు మేమే సాటి మాకెవరు లేరు పోటీ అంటూ పురుషులతో సమానంగా మైన్స్ లో దూసుకువెళుతున్నారు. ఆకాశంలోనే కాదు భూగర్భంలోను మేమే అంటూ వెలుగెత్తి చాటుతున్నారు. మజ్దూర్ నుంచి మేనేజర్ స్థాయి వరకు అన్ని కొలువుల్లో కొలువుదీరి మగమహారాజులకు దీటుగా రాణిస్తామంటూ సవాల్ విసురుతున్నారు ఉమెన్స్. పురుషులే భారంగా భావించే మైనింగ్ విభాగంలో ఉమెన్స్ సత్తా చాటుతూ సవాళ్లను అంతే ధైర్యంగా స్వీకరిస్తూ సత్తా చాటుతున్నారు. ఇది తెలంగాణ ప్రభుత్వ హయాంలో గత కొన్నాళ్ళుగా నెలకొన్న పరిస్థితి... కానీ నాణేనికి ఒక కోణం మాత్రమే...పగటి వెలుగు తర్వాత చీకటి, ఒక విజయం తర్వాత అనేక పరాజయాలు ఉంటాయనే సామెతలు ఉన్నట్టే

సింగరేణిలో “ఆమెకు” అన్యాయం జరుగుతుంది... కాకపోతే ఈ అన్యాయం చేసే వాళ్ళు కూడ మహిళలే కావడం కొసమెరుపు. గత నెలలో కొత్తగూడెం ఏరియాలోని పీవీకే 5 గనిలో అప్రెంటిస్ గా ఉన్న గిరిజన మహిళా ఉద్యోగిని అదే గనిలో పనిచేస్తున్న వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య యత్నం చేసుకుని చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన భవిష్యత్ లో సింగరేణిలో మహిళల ఉద్యోగ మనుగడ పట్ల జవాబు లేని ప్రశ్నలు మిగిలించింది... తోటి మహిళా ఉద్యోగిని మానసిక ధైర్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరించిన మహిళా ఉన్నతాధికారులకు వత్తాసు పలికిన అసిస్టెంట్ జనరల్ మేనేజర్ స్థాయి ఉద్యోగుల వ్యవహారం బట్టబయలు కావడంతో వాళ్లపై సమగ్ర విచారణ జరపాలని పలు గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే ఉన్నతాధికారులను కాపాడే క్రమంలో ఓ చిరుద్యోగిని ఇరికించే ప్రయత్నం జరుగుతుందని, పీవీకే గని మహిళా అప్రెంటిస్ ఉద్యోగిని మృతిపై సమగ్ర విచారణ జరిపి భవిష్యత్ లో సింగరేణిలో పనిచేసేందుకు ముందుకోస్తున్న యువతులకు, మహిళలకు భరోసా ఇచ్చేలా చూస్తారా లేదా అన్నది సింగరేణి అధికారుల చేతిలో ఉంది. పని చేసే విధానం నేర్చుకోవాలని వస్తే బట్టలు ఉతకాలని, బూట్లు శుభ్రంగా ఉంచాలని, తాము చెప్పినట్టు వినకుంటే భవిష్యత్ కు ప్రమాదమనే బెదిరింపులకు దిగి అప్రెంటిస్ ఉద్యోగిని మృతికి ప్రత్యక్ష కారణమైన ప్రతి ఒక్కరి గురించి సమగ్ర విచారణ జరపాలని పలువురు డిమాండ్ చేయడమే కాక ఈ విషయంలో కార్మిక సంఘాలతో పాటు, గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో గిరిజన బిడ్డ మృతిపై ఎలాంటి చర్యలకు సిఫారసు చేస్తారో వేచి చూద్దాం...!

epaper.telanganavanidaily.com
04 Jun 2026 - Page 6

భద్రాద్రి బ్యూరో, జూన్ 04 (తెలంగాణ వాణి) సింగరేణి సంస్థలో అప్రెంటిస్ చేసేందుకు వచ్చిన యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై తెలంగాణ వాణి దినపత్రికలో వచ్చిన కథనం పట్ల ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులు, విధి నిర్వహణ చేసే పీవీకె 5షాఫ్ట్ లో ఉన్నతాధికారులు వ్యవహరించిన తీరు, పని సంబంధిత ఒత్తిళ్లు, వ్యక్తిగత కారణాలు ఉన్నాయా అనే కోణాల్లో అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం, సహోద్యోగుల అభిప్రాయాలు, విధి నిర్వహణ పరిస్థితులపై నివేదికలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటనపై ఇప్పటికే బంధువుల ఫిర్యాదు మేరకు 1టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తుండగా, ఇంటెలిజెన్స్ విభాగం కూడా ప్రత్యేకంగా సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ఈ ఘటన సింగరేణి రాబోయే రోజుల్లో పని చేసేందుకు వచ్చే యువతులు, మహిళలను ప్రభావితం చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను వెలికితీయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులుగా గొడుగునూరి లక్ష్మారెడ్డి



తల్లాడ, జూన్ 4 (తెలంగాణ వాణి): కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులుగా నారాయణపురం గ్రామానికి చెందిన గొడుగునూరి లక్ష్మారెడ్డిని ఎంపిక చేశారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ నియామకపు ఉత్తర్వులను జారీ చేశారు. లక్ష్మారెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకులుగా ఉన్నారు. ఆయన గతంలో కూడా అనేక పదవులు చేపట్టిన అనుభవం ఉంది. ఈ పదవి కోసం తల్లాడ మండల నాయకులు అనేకమంది పోటీపడినప్పటికీ జిల్లా అధిష్టానం ఆయన పేరును ఖరారు చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతంకు కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

**రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు**

**ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది**

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

కరీంనగర్:జూన్ 04 (తెలంగాణ వాణి ప్రతినిది) గురువారం రాత్రి జిల్లాలో కురిసిన అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లా యంత్రాంగం ప్రభుత్వ తరఫున వారికి పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కరీంనగర్ రూరల్, కరీంనగర్ అర్బన్, కొత్తపల్లి తదితర ప్రాంతాల్లో అకాల వర్షం కురవడంతో కొంత మేర ధాన్యం తడిసిందని పేర్కొన్న కలెక్టర్, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 317 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు 261 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్త య్యాయని చెప్పారు. మిగిలిన కేంద్రాల్లో ఉన్న సుమారు 9,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తామని వెల్లడించారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 3.25 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని 16 మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఎనిమిది మండలాల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయని చెప్పారు. చిగురుమామిడి, సైదాపూర్, ఇల్లందకుంట, హుజురాబాద్, జమ్మికుంట, వీణవంక, మానకొండూరు, కేశవపట్నం మండలాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయిందని కలెక్టర్ పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి సత్వరమే మిల్లులకు తరలిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.